క్లుప్తంగా

పన్ను తగ్గించేందుకు కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి

శంకర్‌పల్లి: మున్సిపల్ పరిధిలోని ఇంటి పన్నులను తగ్గించేందుకు కృషి చేస్తున్నామని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని ప్రజలకు ఇంటి పన్నులు, కమర్షియల్ ట్యాక్స్‌లు అధికంగా రావడం తీవ్ర ఇబ్బందులకు గురి కావడం జరుగుతుందని, పన్నులను తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. పన్నులు తగ్గించేందుకు మున్సిపల్ కార్యవర్గం సభ్యుల తీర్మానం కూడా కలెక్టర్‌కు పంపడం జరిగిందన్నారు. త్వరలోనే ఇంటి పన్నులు తగ్గే అవకాశం ఉందన్నారు.

బీజేపీలో చేరిన మాజీ కౌన్సిలర్



బీజేపీలో చేరిన మాజీ కౌన్సిలర్ రషీదా

షాద్‌నగర్‌టౌన్: మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ రషీదా బీజేపీలో చేరారు. గురువారం ఇబ్రహీంపట్నంలో జరిగిన ఓ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ రషీదా బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. అనంతరం సంజయ్ కండువా కప్పి ఆమెను బీజేపీలోకి ఆహ్వానించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితురాలినై బీజేపీలో చేరినట్లు రషీదా తెలిపారు.

కృత్రిమ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్



స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

కేశంపేట: పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు కృత్రిమ ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసిన ఘటన మండల పరిధిలోని చౌలపల్లి గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. సీజ్ చేసిన కృత్రిమ ఇసుక ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుల్ శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

శ్మశానవాటిక ధ్వంసం



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

చేవెళ్ల: మండలంలోని దామరగిద్దలో శ్మశానవాటికకు వేసిన పెన్సింగ్‌ను, శ్మశానవాటికను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని ఎమ్మెల్యే కాలె యాదయ్యను దామరగిద్ద గ్రామస్తులు కలిసి చెప్పారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, రెవెన్యూ అధికారులకు స్మశాన వాటిక స్థలాన్ని రక్షించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో ఏళ్ల తరబడిగా సర్వేనంబర్ 54లో కేటాయించిన హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు చేస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల మధ్యలో శ్మశానవాటిక ఉందని కావాలనే కొందరు వ్యక్తులు ధ్వంసం చేసుంటారని ఆరోపించారు. ఎమ్మెల్యే కాలె యాదయ్యను కలిసి శ్మశాన వాటికకు చుట్టు పెన్సింగ్ లేదా గోడ పెట్టి ఇళ్లకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్డీఓ, తహసీల్దార్‌లను పిలిచి వారికి దామరగిద్ద గ్రామంలోని శ్మశానాటిక స్థలం విషయం రికార్డులు పరిశీలించి సామరస్యంగా సమస్యను పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు.

చెన్నకేశవరెడ్డిని గెలిపించండి

ఆ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాససాగర్

కేశంపేట: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ బలపరిచిన చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రా దాన్యత ఓటు వేసి గెలిపించాలని కేశంపేట మండల పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాససాగర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని బొమ్మలరామారం, తుర్కపల్లి మండలాల్లో మండల ఉపాధ్యాయులు పాల్గొని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాససాగర్ మాట్లాడుతూ... ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చెన్నకేశవ్‌రెడ్డికి మొదట ప్రధాన్యత ఓటు వేసి గెలించాలని అన్నారు. మొదటి నుంచి ఉపాధ్యాయ సమస్యల పరిష్కార కోసం పీఆర్టీయూ అనేక ఉద్యమాలను చేసి చాలా సమస్యలను ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్‌భారీ, మధుసూదన్‌గౌడ్, అమరేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కోమటిరెడ్డి నర్సింహ్మారెడ్డి, నాగిరెడ్డి, మధుప్రకాష్ పాల్గొన్నారు.

అదానీ, అంబానీల కోసమే..

కేశంపేట: అదానీ, అంబానీల కోసమే కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందని, ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న శంకర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఈశాన్య రాష్ట్రాల ఎన్నికలు పూర్తయిన వెంటనే గ్యాస్ సిలిండర్ ధరను పెంచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న ప్రజా వ్యతిరేక, రైతు వ్యతిరేక చట్టాలకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ప్రకటిస్తుందని ఆయన ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, పాలనా ఒక్కటేనని అన్నారు. ప్రజలను మోసగించేందుకే బీఆర్ఎస్, బీజేపీలు ఏకమౌతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సిలిండర్‌ను 500లకే అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాదయ్య యాదవ్, బాబర్‌ఖాన్, గిరియాదవ్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట: సమావేశంలో మాట్లాడుతున్న వీర్లపల్లి శంకర్

గ్యాస్ ధరల పెంపుపై సీపీఐ నాయకుల ధర్నా

చేవెళ్ల: బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదప్రజలపై భారాలను మోపి కార్పొరేట్ సంస్థల యాజమాన్యలకు మేలు చేస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఆరోపించారు. మండలకేంద్రంలో గురువారం సీపీఐ ఆధ్వర్యంలో గ్యాస్ ధరల పెరుగుదలపై రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ప్రధాన రోడ్డుపై గ్యాస్ సిలిండర్ పెట్టి మహిళలతో కలిసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పెట్రోల్, డీజిల్, గ్యాస్‌ధరలు నిరంతరం పెంచుతూనే ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా చమురు బ్యారెల్ ధరలు పెరుగుతున్నాయని సాకు చెబుతుందన్నారు. చమురు బ్యారెల్ ధరలు తగ్గినప్పుడు మన దేశంలో పెట్రోల్ డీజిల్, గ్యాస్ ధరలు ఎందుకు తగ్గడం లేదని ప్రశ్నించారు. పేద ప్రజలు వాడే నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతుంటే ధనికులు ప్రయాణం చేసే విమానం ఇంధనం ధరలు తగ్గుతున్నాయని విమర్శించారు. రానున్న కాలంలో బీజేపీ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో సీపీఐ మహిళా నాయకులు మంజుల, విజయమ్మ, మీనాక్షి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలి

మొయినాబాద్: పెంచిన వంటగ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని సీపీఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మొయినాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ సిలిండర్ ధరలను విపరీతంగా పెంచి సామాన్య ప్రజలపై పెనుభారం మోపుతుందన్నారు. మూడు రాష్ట్రల్లో ఎన్నికలు పూర్తవగానే కేంద్రం వంటగ్యాస్ ధరలను పెంచిందన్నారు. ఇప్పటికే నిత్యావసర సరుకులతో పాటు అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగి సామాన్య, పేద తరగతి ప్రజలపై తీవ్ర ఆర్థికభారాన్ని మోస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి వంటగ్యాస్ ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలన్నారు.

నమ్మించి మోసగిస్తున్న ప్రభుత్వాలు

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్



చేవెళ్ల: గ్యాస్ ధరల పెంపునకు నిరసనగా ధర్నా చేస్తున్న సీపీఐ శ్రేణులు

నేడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను నిరసిస్తూ శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సాయి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

జెడ్పీటీసీ బంగారు స్వరూప

కొందుర్గు: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత టీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కృషితో ప్రతిపల్లెకు బీటీరోడ్డు, ప్రతి గల్లీకి సీసీ రోడ్డు వేయడం జరిగిందని జెడ్పీటీసీ బంగారు స్వరూప అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం తుమ్మలపల్లి గ్రామంలో గురువారం సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాలకు రోడ్డు సౌకర్యం బాగుంటే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయనే ఉద్దేశంతో బీటీ రోడ్లు వేయించడం జరిగిందన్నారు. అందరు సహకరించి అభివృద్ధిని స్వాగతించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రేమ్‌కుమార్, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సయ్యద్ హాఫీజ్, నాయకులు జబ్బార్, వెంకటేష్, స్వామి, వెంకటయ్య, రామచంద్రయ్య, బుచ్చయ్య, బాలయ్య, సువర్ణ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజా సమస్యలను పరిష్కరించండి

ఎంపీడీఓ వెంకయ్యగౌడ్

శంకర్‌పల్లి: గ్రామాల్లో కార్యదర్శులు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్యగౌడ్ పేర్కొన్నారు. గురువారం శంకర్‌పల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఎండలు తీవ్రం అవుతున్నందున ప్రజలకు మంచినీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతలు చేపట్టాలని తెలిపారు. కాగా, గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల్లో యువకులకు కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అంగన్‌వాడీ సెంటర్‌ల్లో మూత్రశాలల పనులను పూర్తి చేయాలని తెలిపారు. కాగా, వందశాతం ఇంటి పన్నులు వసూలు అయ్యే విధంగా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ నాగభూషన్, ఏఈ యుగంధర్, కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకయ్యగౌడ్

మళ్లీ ఇందిరమ్మ రాజ్యం తీసుకువస్తాం

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

షాబాద్: కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి మళ్లీ ఇందిరమ్మ రాజ్యం తీసుకువచ్చేందుకు పార్టీ నాయకులు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని బోడంపహాడ్, అంతారం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి పామెన భీంభరత్, మాజీ టీపీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు సున్నపు వసంతంలతో కలిసి హాత్ సే హాత్ జోడో యాత్ర కార్యక్రమాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన వెంటనే రైతులకు రూ. 2లక్షల రుణామాఫీ, రూ. 5వందలకే గ్యాస్, దళిత, గిరిజనులకు 3 ఎకరాల భూమి, ధరణి పోర్టల్ తొలగిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హయాంలో రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ప్రస్తుతం రూ.12 వందలకు పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి పామెన భీంభరత్, మాజీ టీపీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పని చేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన వారికి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గం యువజన అధ్యక్షుడె పెంటారెడ్డి, మహిళా అధ్యక్షురాలు అశ్విని, మొయినాబాద్ అధ్యక్షుడు మానయ్య, ఎంపీటీసీలు చెన్నయ్య, వెంకట్‌రెడ్డి, అశోక్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఎస్సీసెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు రాములు, చిన్న రాములు, శేఖర్ ఉన్నారు.



జోడో యాత్రలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసేందుకు కుట్ర

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబ



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బీససాయిబాబ ఆరోపించారు. గత రెండు రోజులుగా అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సమ్మెను చేపట్టారు. గురువారం రెండవ రోజు సీఐటీయూ నాయకులు మద్దతు తెలుపుతూ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీససాయిబాబ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలపై సవతి తల్లి ప్రేమను చూపుతుందని, రాష్ట్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో ఐసీడీఎస్‌కు ప్రాధాన్యత ఇవ్వకపోవడమే అందుకు నిదర్శనమన్నారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆరోపించారు. అంగన్‌వాడీలకు వేసవి సెలవులను వర్తింపజేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అంగన్‌వాడీ మినీ సెంటర్‌లను మెయిన్ సెంటర్‌లుగా మార్చాలని కోరారు. వయసుపై బడిన వారికి బీఎల్‌ఓ డ్యూటీలు వేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు రాజశేఖర్, అంగన్‌వాడీ నాయకురాలు జయమ్మ, ఇందిర, ఊర్మిళ, సంగీత, రత్నమ్మ, అనిత, సుజాత, రంగమ్మ, రోజా, శారదమ్మ, చైతన్య, మల్లమ్మ, శాలిని పాల్గొన్నారు.

కళాశాల గుర్తింపు రద్దు చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చేవెళ్ల: కార్పొరేట్ శ్రీచైతన్య పాఠశాల, కళాశాల గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు అరుణ్‌కుమార్, శ్రీనివాస్‌లు అన్నారు. చేవెళ్లలో గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శ్రీచైతన్య కళాశాలలో విద్యార్థి మృతికి నిరసనగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత రాష్ట్రంలో ఉన్న ఆంధ్ర పాలకుల చైతన్య, నారాయణ విద్యాసంస్థలను మూసి వేస్తామని కేసీఆర్ ప్రగల్భాలు పలికాడని అన్నారు. కానీ, రాష్ట్రం వచ్చిన తరువాత అనేక బ్రాంచ్‌లకు నారాయణ, చైతన్య విస్తరించిందని మండిపడ్డారు. అంతేకుండా అధిక ఫీజుల దోపిడీ ఎక్కువైందని విద్యార్థులను చదువు పేరుతో మానసిక ఒత్తిడి ఎక్కువైందని దాని కారణంగా చాలా మంది విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నారని ఆరోపించారు. చనిపోయిన విద్యార్థి కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే సీఎం క్యాంప్ ఆఫీసు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు విఘ్నేష్, సోను, విత, రమ్య, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని ఆందోళన

చేవెళ్ల: అంగన్‌వాడీల సమస్యలపై చేపట్టిన సమ్మె రెండవ రోజు గురువారం ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. మండలకేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద గురువారం చేవెళ్ల డివిజన్‌లోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పెద్ద సంఖ్యలో సమ్మెలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేస్తున్న ఈ సమ్మెలో పాల్గొన్న ఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 70వేల మంది అంగన్‌వాడీ టీచర్లు, ఐసీడీఎస్‌లో 40 ఏళ్లుగా పనిచేస్తున్నారన్నారు. కానీ, నేటి వరకు వారికి ఉద్యోగ భద్రత లేదన్నారు. అన్ని పనులు చేయించుకుంటున్న ప్రభుత్వం కనీసం వారికి ఉద్యోగ భద్రత కల్పించడం లేదన్నారు. గతంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టిన అంగన్‌వాడీలను పిలిచి కేసీఆర్ అంగన్‌వాడీ వర్కర్లు కాదు అంగన్‌వాడీ టీచర్లు అని చెప్పిన కేసీఆర్ మరి టీచర్లకు ఇచినట్లుగా సౌకర్యాలు కల్పించడం లేదని ప్రశ్నించారు. టీచర్లకు సమానంగా ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని తెలంగాణ కూడా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు వరలలక్ష్మి ఉమ, లక్ష్మి, ,అనిత, సౌభాగ్య, ప్రేమలత, కల్పన, భాగ్యమ్మ, సుజాత, సరస్వతిదేవి, గిరిజ, కవిత, నాలుగు మండలాల అంగన్‌వాడీల టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



ఒంటికాలిపై నిరసన తెలుపుతున్న టీచర్లులు

ధైవచింతనతో మానసిక ప్రశాంతత

స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల

కేశంపేట: ప్రతి ఒక్కరూ ధైవచింతన కలిగి ఉండాలని స్త్రీశిశుసంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామంలోని లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విశాల శ్రావణ్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ప్రజలు భక్తిభావాన్ని కలిగి ఉండాలన్నారు. దైవచింతన కలిగి ఉంటే మనస్సు ప్రశాంతంగా ఉంటుందని ఆమె చెప్పారు.

ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి దేవాలయంలో ప్రత్యేక పూజాలు నిర్వహించారు. అనంతరం దేవాలయ కమిటీ సభ్యులు ఆయనను పూలమాల శాలువాతో ఘనంగా సత్కారించారు. అలాగే టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ బండలాగుడు పోటీ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్ కృష్ణయ్య, ఎంపీటీసీ సురేష్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి, జమాల్‌ఖాన్, రూప్లానాయక్, యాదగిరిరావు, అంజయ్య, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న విశాల శ్రావణ్‌రెడ్డి

వృద్ధాప్యాన్ని ఆనందంగా గడపాలి



వృద్ధులకు దుప్పట్లు, దుస్తులను అందజేస్తున్న గీతథామస్‌రెడ్డి దంపతులు

ఎఫ్‌సీఎన్ సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ గీతథామస్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: వృద్ధాప్య జీవితాన్ని ఆనందంగా గడపాలని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్(ఎఫ్‌సీఎన్) సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ గీతథామస్‌రెడ్డి అన్నారు. గురువారం గీతథామస్‌రెడ్డి ఆధ్వర్యంలో వృద్ధులకు భోజనం, దుస్తులు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వృద్ధులు ఆరోగ్య సూత్రాలను పాటించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని సూచించారు. మానసిక ఒత్తిడికి గురి కాకుండా మంచి ఆలోచనలు, చిరునవ్వులతో ఒకరినొకరు పలకరించుకోవాలని చెప్పారు. ఐకమత్యంగా ఉంటూ పరస్పర సహాయ సహకారాలను అందుకోవాలన్నారు. ఎఫ్‌సీఎన్ అందిస్తున్న సేవలు మరువలేనివని, సంస్థ యాజమాన్యానికి వృద్ధులు ప్రత్యేక కృతజ్ఞతలను తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీఎన్ సంస్థ సిబ్బంది, వృద్ధులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వండి

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: డబుల్ బెడ్‌రూం ఇళ్లకు వెంటనే విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డబుల్ ఇళ్ల నిర్మాణం పూర్తి అయిందని, వెంటనే అధికారులు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని సూచించారు. షాద్‌నగర్ పట్టణం, తిమ్మాపూర్, నందిగామలో నిర్మించిన డబుల్ బెడ్ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలన్నారు. అలాగే, నియోజకవర్గంలో కొత్తగా కావాల్సిన సబ్‌స్టేషన్లకు అధికారులు వెంటనే ప్రతిపాదనలు పంపాలన్నారు. వేసవి కాలం ప్రారంభం కావడంతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు ట్రాన్స్‌పార్మర్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్,ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్, నారాయణరెడ్డి, ట్రాన్స్ డీఈ యాదయ్య, ఏడీ, ఏఈలు పాల్గొన్నారు.



షాద్‌నగర్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కులమతాలకతీతంగా ఉర్సు ఉత్సవాలు

కొందుర్గు: మండలంలోని టేకులపల్లి గ్రామ శివారులో గల కల్యాణం పీర్ల ఉర్సు ఉత్సవాలు ప్రతిఏటా కులమతాలకతీతంగా నిర్వహిస్తారు. ఇక్కడ పీర్ల ఉత్సవాలను హిందువుల నిర్వహిస్తారు. పండుగ అనంతరం మొదటి గురువారం ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు. ఒకరోజు ముందు పరిసర గ్రామాలకు సంబంధించిన రైతులందరు ఎద్దుల బండ్లపై వెళ్లి వికారాబాద్ జిల్లా పూడూర్ మండలం కంకల్ గ్రామం నుంచి బ్యాండ్ మేళాల మధ్య గంధం తీసుకొస్తారు. మరుసటి రోజు ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ హాజరై పీర్లకు చాదర్లను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

బైపాస్‌లో కారు దగ్ధం

తప్పిన ప్రాణాపాయం

షాద్‌నగర్‌రూరల్: కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అందులో ప్రయాణిస్తున్న వారు భయాందోళనకు గురయ్యారు. తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఈ సంఘటన గురువారం షాద్‌నగర్ సమీపంలోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. మహబూబ్‌నగర్‌కు చెందిన నవీన్ తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో నివసిస్తున్నాడు. మహబూబ్‌నగర్‌లో శుభకార్యానికి హాజరయ్యేందుకు గురువారం కుటుంబ సభ్యులతో కలిసి తన స్విఫ్ట్ కారులో మహబూబ్‌నగర్‌కు బయలుదేరాడు. కారు షాద్‌నగర్ సమీపంలోని జాతీయ రహదారిపై (సోలీపూర్ శివారులో) వెళుతుండగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఈ విషయాన్ని గమనించిన నవీన్ కారును వెంటనే రహదారిపై పక్కకు నిలిపాడు. దీంతో కారులో ఉన్నవారు కిందకు దిగడంతో ప్రాణాపాయం తప్పింది. విషయాన్ని ఫైర్ ఇంజన్ వారికి సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొవచ్చారు. అనంతరం నవీన్ కారును ఘటనా స్థలంలోనే వదిలిపెట్టి కుటుంబ సభ్యులతో మరో కారులో మహబూబ్‌నగర్ వెళ్లిపోయారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.



మంటల్లో కాలిపోతున్న స్విఫ్ట్ కారు